సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 17 । మార్చి । 2024



రూ.60కోట్లతో ఆస్పత్రులు..

అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఆస్పత్రుల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. వివరాలు 8లో ▸



రైతులకు ప్రోత్సాహం

ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటుకునేందుకు ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తుంది. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం (సాయంత్రం) 6:32	సోమవారం (ఉదయం) 5:00

న్యూస్‌రీల్

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

ఎంపీ బీబీపాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

నారాయణఖేడ్: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని జహీరాబాద్ ఎంపీ, లోక్‌సభ ఎన్నికల ఆ పార్టీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలం.. బలగం అన్నారు. మోదీ నాయకత్వంలో బీజేపీని మరోసారి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాషాయం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షురాలు గోదావరి, అరుణతార, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, అభిషేక్ పాటిల్, జన్‌వాడే సంగప్ప, విజయపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రవికుమార్, రజినీకాంత్ పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న మల్లేశం

వట్‌పల్లి(అందోల్): ఇందిరాక్రాంతి పథకం ద్వారా మహిళా సమాఖ్య సభ్యులకు అందిస్తున్న రుణ లక్ష్యాలను ఈనెల 25లోగా పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మల్లేశం సూచించారు. శనివారం వట్‌పల్లిలోని మహిళ సమాఖ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బ్యాంకు లింకేజీకి సంబంధించి 2023–24 సంవత్సరానికి గాను రూ.769.60 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.799కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. దీనిద్వారా 108 శాతం లక్ష్య సాధన పూర్తయిందని తెలిపారు. వీటి ద్వారా జిల్లాలోని 13,329 ఖాతాలకు గాను రూ.12.98 కోట్లు సంబంధిత స్వయం సహాయక సంఘాల ఖాతాలలో వడ్డీ జమ అయిందన్నారు. మండలానికి 92 శాతం మేర రుణ లక్ష్యం జరిగిందని, మిగతాది త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐపీఎం చంద్రశేఖర్, సీసీలు ఈశ్వరయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

సండే స్పెషల్

చిత్రం.. భెల్ విచిత్రం





భెల్ టౌన్‌షిప్‌లో సినిమా షూటింగుల దృశ్యాలు



లైట్స్ ఆన్.. స్టార్ట్... కెమెరా.. యాక్షన్.. ఈ సౌండ్లు భెల్ (బీహెచ్‌ఈఎల్) పరిసరాల్లో నిత్యం వినిపిస్తుంటాయి. లవ్ సీన్లు.. పోరాట ఘట్టాలు.. ఫ్యామిలీ సన్నివేశాలను చిత్రీకరిస్తూ ఆ ప్రాంతమంతా రంగుల ప్రపంచాన్ని తలపిస్తుంటుంది. పచ్చని అందాల నడుమ హీరో హీరోయిన్ల మధ్య సీన్లు తీస్తూ దర్శకులు, కెమెరామెన్లు ఎప్పుడూ హడావిడిగా కనిపిస్తుంటారు.

– పర్సా శ్రీనాథ్,
రామచంద్రాపురం (పటాన్‌చెరు)

నిత్యం షూటింగ్‌లతో సందడి

- లొకేషన్‌కు అమితాబ్, రజనీకాంత్‌ల రాక
- సినిమాల చిత్రీకరణకు డైరెక్టర్లకు అనుకూల ప్రదేశం
- ఖర్చు తక్కువ.. సదుపాయాలు ఎక్కువ

భెల్ ప్రాంతం సినిమా షూటింగులకు, షార్ట్‌ఫిలిం చిత్రీకరణలకు నెలవుగా మారింది. ఇక్కడ నిత్యం ఏదో ఒక షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. పెద్ద చిన్న ఆర్టిస్టుల రాకతో ఈ ప్రాంతమంతా సందడి నెలకొంటుంది. జిల్లాలోని రామచంద్రాపురం మండలంలో ఉన్న భెల్ టౌన్‌షిప్ వేల ఎకరాలలో విశాలమైన ప్రాంతంగా పేరుగాంచింది. విశాలమైన రోడ్లు, పచ్చని చెట్లు ఉండటంతో డైరెక్టర్లు ఇక్కడ షూటింగులు చేయడానికి ఆసక్తి చూపుతారు. అటవీ ప్రాంతం, ఎక్కువ జనాభా ఉండకపోవడంతో చిత్రీకరణకు అనుకూలమైన విషయాలుగా మారాయి. అందులోనూ హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో భెల్ సినీ షూటింగులకు కొత్త వేదికగా తయారైంది.

అగ్రనటుల షూటింగ్..

హైదరాబాద్‌లో ఫిలింసిటీ, పెద్దపెద్ద స్టూడియోలు ఉన్నప్పటికీ ప్రస్తుతం భెల్‌కాలనీలోనే షూటింగులను తీస్తున్నారంటే ఇక్కడ వాతావరణం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గత నెలలో సినీ చరిత్రలో సూపర్ స్టార్లు అయిన అమితాబచ్చన్, రజనీకాంత్ వంటి అగ్రశ్రేణి నటుల సినిమాలు కూడా భెల్ టౌన్‌షిప్‌లో షూటింగ్ జరుపుకోవడం విశేషం అలాంటి పెద్ద నటులు ఇక్కడికి రావడంతో ఆ ప్రాంతంలో కొత్త ఉత్సహం నెలకొంది.

ఖర్చు తక్కువే..

హైదరాబాద్‌లో ఎక్కడైనా షూటింగ్ కోసం సెట్టింగ్ వేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సిందే. తక్కువ ఖర్చుతో పనిపూర్తి చేసేందుకు డైరెక్టర్లు, నిర్మాతలు బెల్ కాలనీని ఎంచుకుంటున్నారు. షూటింగ్ సమయంలో ఇక్కడ ఎటువంటి సమస్యలు ఉండవు. లంబసింగి, ఊటీ వంటి ప్రదేశాలకు తీసిపోని విధంగా ఈ ప్రాంతంలో పచ్చదనం ఉండటం నిర్మాతలకు లాభదాయకంగా మారింది. అలాగే సిటీకి దగ్గరలో ఉండటం వల్ల యాక్టర్లకు, డైరెక్టర్లకు రాకపోకలకు చాలా తేలికగా ఉంటుంది. 15ఏళ్ల క్రితం కాలనీలో జోరుగా సినిమా షూటింగ్‌లు జరిగేవి. కారణమేమో గాని ఆ మధ్యలో ఆపేశారు. ఇటీవల తిరిగి భెల్‌కాలనీలో నిర్విరామంగా షూటింగ్‌లు జరుగుతున్నాయి.

రూ.5కోట్ల ఆదాయం

షూటింగ్‌ల జరుపుకోవాలంటే భెల్‌కాలనీలో డిమాండ్ బాగానే ఉంది. యాజమాన్యం ఒక్కరోజు షూటింగ్ కోసం సుమారు రూ.35వేలు తీసుకుంటుంది. సినిమా షూటింగ్‌లు ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు సుమారు రూ.5కోట్లు ఆదాయం వచ్చింది.

ప్రకృతికి పుట్టినిల్లు



భెల్ టౌన్‌షిప్ ప్రకృతికి పుట్టినిల్లు. ఇక్కడ ఎలాంటి సెట్టింగ్‌లు వేసినా అందులో రియాల్టీ కనిపిస్తుంది. బయట సినిమా షూటింగ్ తీయాలంటే ఇబ్బందులు. అగ్ర హీరోలు అమితాబచ్చన్, రజినీకాంత్, కమల్‌హాసన్, రామ్‌చరణ్, మహేష్‌బాబు లాంటి హీరోలు సైతం ఈ లోకేషన్‌కు వస్తుంటారు.

– శ్రీహరి గౌడ్, ఫిలిం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్

ఆహ్లాదకరమైన వాతావరణం



భెల్ టౌన్‌షిప్‌లో పుట్టి పెరిగా. ఇక్కడే చదువుకున్న. నేను సినీ రంగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలు పెట్టా. కాలనీలో షూటింగ్‌లకు అనుమతులు ఇస్తున్నారు. కథలోని సీన్స్ రాసేటప్పుడు ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణం గుర్తు చేసుకుని సీన్స్ రాసుకుంటాం.

– కంకిపాటి సుమన్ విశాల్, సినీ రచయిత

షూటింగ్‌లకు అనుకూలం



బయట లోకేషన్స్‌లో షూటింగ్‌లు చేసే సమయంలో కెమెరామన్‌లకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రజలు, లైటింగ్ సమస్యలుంటాయి. భెల్ కాలనీలో మాత్రం ప్రశాంతంగా షూటింగ్ చేసుకోవచ్చు. విశాలమైన రోడ్లు ఉండటం వల్ల బైక్, కారు చేజింగ్ సీన్లకు బాగుంటాయి.

– రవికుమార్, కెమెరామన్

కవిత అరెస్టు.. రాజకీయ కుట్ర



జోగిపేటలో నిరసన తెలుపుతున్న క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): ఎమ్మెల్సీ కవిత అరెస్టు రాజకీయ కుట్రలో భాగమేనని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. కవిత అరెస్టుకు నిరసనగా రాష్ట్ర బీఆర్ఎస్ పిలుపు మేరకు జోగిపేట జాతీయ రహదారిపై శనివారం బైఠాయించి నిరసన తెలిపారు. కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. రాస్తారోకో కారణంగా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై బీఆర్ఎస్ పార్టీని తొక్కేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. లిక్కర్ కేసులో ఎలాంటి ప్రమేయం లేని కవితను ఈడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, పల్లె సంజీవయ్య, నాగభూషణం, రామాగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

రాజీమార్గం రాజమార్గం



పరిహారం అందిస్తున్న హైకోర్టు జడ్జి

సంగారెడ్డి టౌన్ : జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు సత్వరమే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 11 బెంచీలలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రాజీపడటం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. 51,078 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.శ్యామ్ కోషి, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ఎస్పీ రూపేష్ పాల్గొన్నారు. అనంతరం పోతిరెడ్డిపల్లి హౌసింగ్ బోర్డు సంబంధించిన నష్టపరిహారం బాధితులకు అందించారు.

నారాయణఖేడ్: రాజీమార్గమే రాజమార్గమని ఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. 379 కేసులను పరిష్కరించారు.

సహనానికి చిరునామా మహిళలు



మాట్లాడుతున్న డీఈవో

సంగారెడ్డి అర్బన్: సహనానికి మారు పేరు మహిళలు అని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు కొనియాడారు. టీపీటీఎఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గాంధీ సెంటినరీ పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షురాలు మర్రి ప్రశాంతి అధ్యక్షతన శనివారం మహిళా సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఏ.విజయలక్ష్మీ, సైకలాజిస్ట్ శైలజ విస్సమ్‌శెట్టి, జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, రాంచందర్, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, సునీత, నాసర్ పటేల్ పాల్గొన్నారు.

మోగిన నగారా



- విడుదలైన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్
- అమలులోకి ఎన్నికల కోడ్
- అభ్యర్థుల ఎంపికలో ప్రధాన పార్టీలు
- మెదక్, జహీరాబాద్‌లలో త్రిముఖ పోటీ
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సార్వత్రిక ఎన్నికల సమరానికి తెరలేచింది. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలున్నాయి. మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్లున్న విషయం విదితమే. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. మెదక్ స్థానానికి మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు.

అమలులోకి ఎన్నికల కోడ్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలులోకి వచ్చింది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొత్తగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి వీలు లేదు. కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుంది.

అభ్యర్థుల ప్రకటనలో ప్రధాన పార్టీలు..

ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంలో బిజీగా ఉన్నాయి. మెదక్ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు ఖరారు కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జహీరాబాద్ స్థానానికి ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్‌లు బరిలో ఉండనున్నారు. ఈ అభ్యర్థులు నియోజకవర్గంలో తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఆయా పార్టీల కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ప్రభావితం చేయగల సామాజికవర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

రెండు చోట్లా త్రిముఖ పోటీ

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకున్న విషయం విదితమే. అయితే పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్, బీజేపీలు కూడా నువ్వా నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌కు దక్కగా, మిగిలిన ఆరు చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించిన విషయం విదితమే. ఇక జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో అందోల్, నారాయణఖేడ్‌లు మాత్రమే కాంగ్రెస్ గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రెండు చోట్ల కూడా త్రిముఖ పోటీ ఉంటుంది. మూడు పార్టీలు కూడా హోరాహోరీగా తలపడనున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లా వివరాలు

7 నియోజకవర్గాలు

మొత్తం ఓటర్లు	18,12,858
మహిళా ఓటర్లు	8,95,777
పురుష ఓటర్లు	9,16,876
ఇతరులు	205
పోలింగ్ కేంద్రాలు	2098

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం

అసెంబ్లీ సెగ్మెంట్	పోలింగ్ కేంద్రాలు
నారాయణఖేడ్	296
అందోల్	313
జహీరాబాద్	313
జుక్కల్	255
ఎల్లారెడ్డి	270
కామారెడ్డి	266
బాన్సువాడ	258
మొత్తం	1,971

జహీరాబాద్ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు..

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
నారాయణఖేడ్	1,18,410	1,17,958	9	2,36,377
అందోల్	1,22,296	1,27,785	5	2,50,086
జహీరాబాద్	1,37,054	1,37,140	2	2,74,196
జుక్కల్	99,230	1,02,991	9	2,02,230
ఎల్లారెడ్డి	1,06,550	1,15,708	2	2,22,260
కామారెడ్డి	1,21,980	1,31,882	19	2,53,881
బాన్సువాడ	93,368	1,02,631	13	1,96,012
మొత్తం	7,98,888	8,36,095	59	16,35,042

అమల్లోకి కోడ్

సంగారెడ్డి టౌన్ : సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ నేటి నుంచి అమలులో ఉంటుందని ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ రూపేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలు జహీరాబాద్, మెదక్‌లో మే13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఏప్రిల్ 18న నామినేషన్ ప్రక్రియ, ఏప్రిల్ 25న నామినేషన్ కు చివరి తేదీ, ఏప్రిల్ 29న విత్ డ్రా , మే 13న ఎలక్షన్, జూన్ నాలుగవ తేదీన కౌంటింగ్ ఉంటుంది అన్నారు. ఓటర్లకు ఏమైనా సమస్యలుంటే హెల్ప్ లైన్ నంబర్ 1950కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలలో ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఉండకూడదని.. ప్రభుత్వపరమైన ఎలాంటి నూతన పనులు ప్రారంభించకూడదని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ కోడ్ అమల్లో ఉండడంవల్ల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదుపై నియంత్రణ ఉంటుందని, తప్పనిసరిగా రశీదు తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో ఎస్పీ రూపేష్

క్లుప్తంగా

సంగారెడ్డిలో జబర్దస్త్ ఫేం రోహిణి సందడి



షాపును ప్రారంభిస్తున్న రోహిణి

సంగారెడ్డి: సంగారెడ్డి బైపాస్ రోడ్డు కొత్తగా ఏర్పాటు చేసిన సెలూన్ షాపును జబర్దస్త్ ఫేం రోహిణి ప్రారంభించారు. సెలూన్‌లో పెళ్లి కూతురు మేకప్ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. నిపుణుల ద్వారా హెయిర్ డ్రెస్సింగ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. రోహిణి సంగారెడ్డి రావడంతో కాసేపు అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

కరువుభత్యం చెల్లించాలి

నర్సాపూర్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన నాలుగు విడతల కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు గుండం మోహన్‌రెడ్డి శనివారం డిమాండ్ చేశారు. ఈ నెల 10న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రాలపై సానుకూలంగా స్పందించినప్పటికీ మంత్రి వర్గ సమావేశంలో చర్చించకపోవడం విచారకరమని అన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉచిత వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కరువు బకాయిలు విడుదల చేస్తే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు కొంత ఉపశమనం లభిస్తుందని కోరారు.

నాగల్‌గిద్ద రైతులకు అవార్డు



అవార్డు అందుకుంటున్న, నాగల్‌గిద్ద రైతులు

మనూరు(నారాయణఖేడ్): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్వహిస్తున్న గ్రామభారతీ కిసాన్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా శనివారం నాగల్‌గిద్ద మండల రైతులు అవార్డు అందుకున్నారు. రైతులు స్థానికంగా నడుపుతున్న దాల్‌మిల్లుకు సంబంధించి మార్కెటింగ్ విధానం, కంది పప్పుకు ప్రాసెసింగ్ నిర్వహించి మార్కెట్‌కు తరలిస్తున్న విధానాన్ని సెమినార్‌లో ప్రాక్టికల్‌గా వివరించారు. రైతులు చూపిన స్కిల్స్ విధానం ఆకట్టుకోవడంతో అవార్డు వరించింది. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా మహిళా రైతు బిక్కుబాయి, రాజు అవార్డు అందుకున్నారు. స్థానిక రైతులు వారిని అభినందించారు.





ఎవరైనా దినపత్రికను చదివిన తర్వాత ఏం చేస్తారు.. ఇంట్లో మిద్దెలపైనో, అటకలపైనో పరిచి.. కొన్ని ఇతరత్రా వాడి.. మిగిలిన పేపర్లన్నీ నెల తర్వాతో.. రెండు నెలల తర్వాతో పాతపేపర్ల వారికి అమ్మేస్తుంటారు. దాదాపుగా చాలామంది చేసేది ఇదే. కానీ హుస్నాబాద్ పట్టణానికి చెందిన నాదమునుల రామారావు మాత్రం పత్రికను ప్రాణంగా భావిస్తారు. ప్రతి కాపీని జాగ్రత్తగా భద్రపరుస్తారు. పత్రికలు ఎక్కడ చెదలు పడుతాయోనని నాఫ్తలిన్ గోలీలు చల్లి అట్ట పెట్టెల్లో సీజ్ చేస్తుంటారు. ఇలా ఏడాదో, రెండేళ్లుగా కాదు ఏకంగా దాదాపు యాభై ఏళ్ల నుంచి నేటి వరకు వార్తా పేపర్లు, వివిధ రకాల పుస్తకాలకు తన ఇంటిలోనే భద్రపరుస్తూ వస్తున్నారు. పుస్తకాలు లేని ఇల్లు దేవుడు లేని గుడి వంటిదని భావిస్తున్న ఆయన జీవనశైలిపై సాక్షి కథనం.

– చల్లా రాజు, హుస్నాబాద్:

పత్రికలే ప్రాణంగా..

దినపత్రికలే ఆయన ఆస్తులు, పిల్లలు, అతిథులు... అన్నీ

- 50 ఏళ్ల నాటి పత్రికలు, పుస్తకాలు భద్రంగా..
- రోజూ 5 తెలుగు దినపత్రికలు, 2 ఇంగ్లీష్ పత్రికలు కొనుగోలు
- పేపర్ ధర నాలుగు పైసలు ఉన్నప్పటి నుంచి..
- సాక్షి దినపత్రిక ప్రారంభ పేపర్ నుంచి నేటి వరకు సేకరణ
- పత్రికా ప్రియుడు రామారావు విభిన్న శైలి



రామారావు ఇంట్లో పత్రికల వరుసలు

సాక్షి ప్రత్యేకం

మనం ఎవరి ఇంటికైనా వెళ్తే మొదటగా కనిపించేవి ఖరీదైన ఫర్నిచర్, అందమైన అలంకరణ వస్తువులు. కానీ నాదమునుల రామారావు ఇంటికి వెళ్తే ముందుగా దినపత్రికలు, పుస్తకాలే దర్శనమిస్తాయి. అందమైన అలంకరణ వస్తువులు, ఫర్నిచర్ ఉన్నా, పుస్తకాలు లేకుంటే కళాహీనంగా ఉంటుందని ఆయన భావిస్తారు. రామారావు ఇంటిలో ఏ మూలకు చూసిన దినపత్రికలు, ఏ సజ్జ మీద చూసిన, వంట గదిలో చూసినా వివిధ రకాల పుస్తకాలు, పత్రికలు భద్రపరిచి ఉంటాయి. ఆయన ఇంట్లో ఏ పేపర్, ఏ పుస్తకాన్ని చూసిన ఇప్పుడే ముద్రించినట్లుగా కనిపిస్తాయి. ఒకప్పుడు పాఠకలోకాన్ని, పుస్తక ప్రియులను ఆనంద అనుభూతులతో ఓలలాడించిన దినపత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు, చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, విజయచిత్ర, భారతీ, సినిమా రంగం, సోవియట్ యూనియన్, సోవియట్ లాండ్, సోవియట్ ఉమెన్, ఇంకా తాళపత్ర గ్రంథాలు, ఏళ్ల సంవత్సరాల నాటి పుస్తకాలు ఆయన ఇంటిలో కొలువయ్యాయి. సాక్షి దినపత్రిక ప్రారంభ పేపర్ నుంచి ఇవాల్టి ఎడిషన్ వరకు అన్ని ప్రతులను భద్రపరిచారు.

డిజిటలైజేషన్ చేస్తా :

పుస్తకాలు భగవత్ స్వరూపాలని ప్రగాఢంగా విశ్వసించే నాకు పేపర్ నలిగినా, చిరిగినా ప్రాణం విలవిల్లాడుతుంది. నేటి వార్త రేపటి చరిత్ర. చరిత్రకు పట్టుకొమ్మలే దినపత్రికలు. అందుకే పేపర్ ధర నాలుగు పైసలు ఉన్న సమయం నుంచి పేపర్లను సేకరిస్తున్నాను. ఏళ్ల నాటి ఒక పేపర్ కావాలంటే రూ.లక్ష వెచ్చించినా దొరకదు. నా వద్ద ఉన్న పత్రికలు, పుస్తకాల సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయాలనే ఆలోచనలో ఉన్నాను.

– నాదమునుల రామారావు, హుస్నాబాద్



ఏళ్ల నాటి పత్రికలు



దినపత్రికను చదువుతున్న రామారావు దంపతులు

దినపత్రికలే వారికి ఆస్తి..

రామారావు, అభినందన దంపతులకు సంతానం లేదు. సొంత ఇల్లు లేదు. ఇతరత్రా ఆస్తిపాస్తులు లేవు. వీరిద్దరూ ఉన్నత విద్యలు చదివారు. రామారావు ఎం.ఏ ఇంగ్లిష్, భార్య అభినవ ఎం.కాం పూర్తి చేశారు. వీరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు వచ్చినా.. ఆ రెండు ఉద్యోగాలు తమకంటే ఎక్కువ అవసరాలు ఉన్న వారికి ఉపయోగపడాలనే ఉన్నతమైన ఆశయంతో ఒదులుకున్నారు. కాలుష్య నివారణలో భాగంగా సొంత వాహనం కూడా కొనలేదు. 25 మంది పిల్లలకు ఇంగ్లిష్ గ్రామర్ చెబుతూ వచ్చే ఆదాయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. రామారావు తెల్లవారు జామునే బస్టాండ్ స్టాల్‌కు నడిచి వెళ్లి పేపర్లు కొని తెచ్చుకొని చదువుతాడు. ప్రతి రోజూ 5 తెలుగు దినపత్రికలు, 2 ఇంగ్లిష్ పత్రికలు కొనుగోలు చేస్తాడు. పత్రికల్లో వచ్చే సమాచారాన్ని రామారావు దంపతులు విద్యార్థులకు పాఠాలుగా అందిస్తున్నారు. ప్రతి రోజూ ఇంగ్లిష్ గ్రామర్ నేర్పుతూనే పత్రికల్లో వస్తున్న సంఘటనలు, కథనాలను చదివిస్తూ పేపర్లపై అవగాహన కల్పిస్తున్నారు.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



రామారావు సార్ వద్ద ట్యూషన్‌కు వస్తున్నా. ఇంగ్లిష్ గ్రామర్, వివిధ సబ్జెక్ట్‌లపై పాఠాలు చెబుతున్నారు. అలాగే పేపర్‌లో వచ్చే విషయాలు కూడా చెబుతున్నారు. రోజూ న్యూస్ పేపర్ చదివిస్తారు. ఆరోగ్యరీత్యా సెల్‌ఫోన్‌లో కన్నా ప్రింట్ పేపర్ చదివితేనే మంచిదని, జ్ఞాపకం ఉంటుందని సార్ చెబుతుంటారు.

– డి.దీపిక, 5వ తరగతి, హుస్నాబాద్

హోం వర్క్‌లో భాగం



న్యూస్ పేపర్ చదవడం మా హోంవర్క్‌లో ఓ భాగం. చాలా విషయాలు పేపర్ ద్వారా తెలుసుకుంటున్నాం. సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించవద్దని చెబుతారు. పేపర్‌లో ఉన్న ఘటనలు వివరిస్తూ మాకు అర్థమయ్యే రీతిలో చెబుతారు. దీంతో పేపర్ చదవాలనే ఆసక్తి పెరుగుతోంది.

– బి. రుషిక్, 7వ తరగతి, హుస్నాబాద్

మా హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

జహీరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే జహీరాబాద్ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో రూ.1.04 కోట్లతో నిర్మించిన 20 దుకాణాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో డీసీఎంఎస్ అంటే రైతులకు తెలిసేది కాదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకే వారికి చేరువైందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎం.శివకుమార్ నియమితులైన అనంతరం ఈ సంస్థకు కళ వచ్చిందన్నారు. దుకాణాల సముదాయం నిర్మించడం వల్ల వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, ఆయా పార్టీలకు చెందిన నాయకులు నారాయణ, నర్సింహులు, నర్సింహారెడ్డి, ఎం.జి.రాములు, వెంకటేశం, అశోక్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నిరసన

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంభిస్తోందన్నారు. ప్రతి పక్షాలను వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ శ్రేణులు

273 కేసుల పరిష్కారం

జహీరాబాద్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 273 కేసులు పరిష్కామైనట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ శనివారం తెలిపారు. 51 బ్యాంకు పీఎల్సీ కేసులు పరిష్కారం కాగా రూ.63,24,319 వసూలైనట్లు పేర్కొన్నారు. జూనియర్ కోర్టు విభాగంలో 6 సివిల్ కేసులు, క్రిమినల్ కాంప్రమైజ్ కేసులు 45, సెకండ్‌క్లాస్ కేసులు 12, అడ్మిన్ కేసులు 138, ఎక్సైజ్ కేసులు 21 మేర పరిష్కారమైనట్లు వివరించారు. కాగా రూ.1,01,260 వసూలయ్యాయని తెలిపారు.



కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

రూ.60 కోట్లతో ఆస్పత్రులు మంజూరు

- రూ.45 కోట్లతో వంద పడకల ఏరియా ఆస్పత్రి
- రూ.15 కోట్లతో యాభై పడకల ఎంసీహెచ్..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జోగిపేటలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

జోగిపేట(అందోల్): అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.60 కోట్లతో ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహ మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు శనివారం ఉదయం వెలువడ్డాయి. ఇందులో రూ.45 కోట్లతో వంద పడకల ఏరియా ఆస్పత్రి, రూ.15 కోట్లతో యాభై పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ ఆస్పత్రులను అందోలు శివారులోని 12 ఎకరాల స్థలంలో నిర్మించేందుకు మంత్రి నిర్ణయించారు. ఈ విషయంపై హర్షం వ్యక్తం చేస్తూ జోగిపేటలోని హనుమాన్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీ.దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచాలు, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కే.నాగరాజు, రేఖా ప్రవీణ్ కుమార్, చందర్, దుర్గేశ్, హరి కృష్ణాగౌడ్, కోఆప్షన్ సభ్యుడు అల్లె శ్రీకాంత్, నాయకులు మురళీ, అలీఅబ్బాస్, రాజశేఖర్, మధులతోపాటు పలువురు పాల్గొన్నారు. అలాగే, ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, ఎ.చిట్టిబాబు, రంగ సురేశ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. మూడు మాసాల్లో సుమారుగా రూ.200 కోట్లకు పైగా నిధులను మంజూరు చేయించిన ఘనత మంత్రి దామోదరది అని కొనియాడారు.



సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

క్రైం కార్నర్

టిఫిన్ చేసి వస్తుండగా..

- స్కూటీని ఢీకొట్టిన లారీ యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: స్కూటీని రెడీమిక్స్ లారీ ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం కానుకుంటకు చెందిన శ్రావంత్(21), అతడి స్నేహితులు నవీన్, భార్గవ్ రెండు ద్విచక్ర వాహనాలు తీసుకొని శుక్రవారం రాత్రి టిఫిన్ చేసేందుకు రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్ రోడ్డు వద్దకు వచ్చారు. టిఫిన్ చేసి తిరిగి వెళ్తున్న సమయంలో పటాన్‌చెరు యాక్సిస్ బ్యాంక్ సమీపంలోకి రాగానే సంగారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న రెడీమిక్స్ లారీ శ్రావంత్ నడుపుతున్న స్కూటీని కొట్టింది. వెంటనే తోటి స్నేహితులు నవీన్, భార్గవ్ శ్రావంత్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, మృతుడి తండ్రి సాంబశివుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దర్శనానికి వెళ్లొస్తుండగా..

- ఆటోను ఢీకొట్టిన మరో ఆటో
- పలువురికి గాయాలు

నారాయణఖేడ్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన మరో ఆటో ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌కు చెందిన ఓ కుటుంబం ఆటోలో శనివారం ఏడుపాయలకు వెళ్లి దర్శనం చేసుకొని తిరుగు పయనమయ్యారు. ఆటోలో గ్యాస్ అయిపోవడంతో నారాయణఖేడ్‌కు వచ్చి గ్యాస్ నింపుకొని గ్రామానికి బయలుదేరారు. ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తావద్ద ఎదురుగా వస్తున్న ఓ గుర్తు తెలియని ఆటో వేగంగా వచ్చి వీరి ఆటోను ఢీకొట్టడంతో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న భాగవ్వ (45)కు తీవ్రగాయాలు కాగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఢీ కొట్టిన ఆటో ఆగకుండా వెళ్లిపోయింది. క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి గురైన ఆటో

ఈతకు వెళ్లి.. చెరువులో శవమై తేలి

సిద్దిపేటకమాన్: చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం గాంధీ నగర్‌కు చెందిన కెమ్మసారం రాజు (25) శుక్రవారం పట్టణంలోని కోమటి చెరువులో స్నానం చేయడానికి ఈతకొడుతూ వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. శనివారం ఉదయం చెరువులో మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రాజు (ఫైల్)

చెరువులో దూకి బాలుడు ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్): చెరువుకుంటలో దూకి బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం ధరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు మండలంలోని ధరిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నెల్లూరు, శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు మెంటు(16) పదవ తరగతి మధ్యలో ఆపేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై గ్రామంలో, ఇంట్లో తరుచూ గొడవ పడుతున్నాడు. శుక్రవారం గ్రామంలో గొడవపడగా తల్లిదండ్రులు మందలించారు. అదే రోజు రాత్రి మద్యంమత్తులో ఉన్న బాలుడు సాయమ్మకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

పడిపోవడంతో వ్యక్తి మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కొమురవెల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు .. చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన చంద్రమౌళి సిద్దిపేటలో సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సోదరి గౌరవ్వ ఇంటికి చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లికి వెళ్లాడు. తిరిగి సిద్దిపేటకు వస్తున్న క్రమంలో రాత్రి కొమురవెల్లి శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండుకు చేరిన మృతుల సంఖ్య

సిలిండర్ పేలిన ఘటనలో ..



కీర్తి(ఫైల్)

జహీరాబాద్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఈనెల 10న వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడగా వారిని వైద్యం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో లక్ష్మన్న (68) శుక్రవారం మరణించడం విదితమే. ఇదే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి కీర్తి(04) శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. చిన్నారి తల్లి ఎరుకలి సుగుణమ్మ ఆస్పత్రిలో వైద్యం పొందుతోంది.

రెండు బైక్‌లు ఢీ

పటాన్‌చెరుటౌన్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన జానకి మల్లేశ్ (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీలో ఉండే స్నేహితుల వద్దకు బైక్ పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా మోడీ బిల్డర్స్ చౌరస్తా సమీపంలో అమీన్‌పూర్ వైపు నుంచి వస్తున్న మరో బైక్ మల్లేశ్ బైక్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లేశ్‌కు తీవ్ర గాయాలు కాగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటఅర్బన్: పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని పొన్నాల గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారన్నారు. గ్రామానికి చెందిన సలేంద్రి ఎల్లం, పొలుసు కృష్ణ, రంగయ్య, పొలుసు రమేశ్, పిల్లుట్ల ప్రవీణ్ పేకాట ఆడుతున్నారని తెలిపారు. వీరిలో ఎల్లం, కృష్ణ పట్టుబడగా మిగితా ముగ్గురు పారిపోయారని, పట్టుబడిన వారి నుంచి రూ.2,400 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

రాయికోడ్(అందోల్): స్థానిక ఇందిర క్రాంతి భవనం సమావేశ మందిరంలో శనివారం 91 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. నగదును డబ్బును సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్. మొగులప్ప, తాజా, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మల్లికార్జున్ పాటిల్, అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి.నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు కేదారినాథ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య, సొసైటీ చైర్మన్ నాగిశెట్టి పాటిల్, ఎంపీటీసీ సభ్యుడు పండరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏ.ప్రభాకర్, నాయకులు మాణిక్, విఠల్ తదితరులు ఉన్నారు.

చెట్టు కొమ్మలు కొడుతుండగా

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి

బాల్కొండ: విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాకేడ్ గ్రామానికి చెందిన మల్లేశ్(25) బతుకు దెరువు నిమిత్తం మెండోరాకు వచ్చి మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఉదయం మేకలను మేత కోసం మండల శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ చెట్టుపై నుంచి కొమ్మలను నరుకుతుండగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.